సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 25 । ఆగస్టు । 2025



ఈవీ.. రయ్ రయ్ !

ఖమ్మం జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం అన్ని రకాల వాహనాలు కలిపి 4,044 ఉన్నాయి. 8లో



ఐటీఐతో ఉపాధి అవకాశాలు

ఐటీఐ కోర్సులతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు, ఐటీఐ కళాశాల బాధ్యులు కృషి చేస్తున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమయ్యే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్ర కూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి ఖమ్మం బ్యాంక్ కాలనీకి చెందిన పోట్ల వంశీకృష్ణ రూ.1,00,116 వితరణగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ లింగాల సాయిబాబు, వేద పండితులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లి ఆలయంలో వచ్చేనెల 2న వ్యాపార దుకాణాల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. ఈనెల 22న నిర్వహించిన వేలానికి పాటదారులు రాకపోవడంతో వాయిదా వేసిన విషయం విదితమే.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై ప్రజావాణిలో లిఖిత పూర్వకంగా వినతులు అందజేయాలని సూచించారు.

కిన్నెరసానికి పోటెత్తిన పర్యాటకులు

ఒకరోజు ఆదాయం రూ.40,500



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 520 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.28,350 ఆదాయం లభించగా, 220 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.12,150 ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

వరదకు వాన తోడైతేనే..



గోదావరి వరద మాత్రమే వచ్చినప్పుడు నీరు చేరని రహదారి (ఫైల్)



వరద, వర్షం వచ్చిన రోజు ఆలయ సమీపాన రహదారిపై నీరు (ఫైల్)

భద్రాచలానికి ముంపు గోదావరితో కాదు

- తాజాగా గోదావరికి 13.66 లక్షల క్యూసెక్కుల వరద
- అయినా ఆలయ పరిసరాల్లో ఎదురుకాని సమస్య
- వరద, వర్షం ఒకేసారి వస్తేనే ఇక్కట్లు
- ఏళ్ల నాటి సమస్యకు కానరాని శాశ్వత పరిష్కారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి వరద నుంచి భద్రాచలం పట్టణానికి రక్షణ కోసం 20 ఏళ్ల క్రితం కరకట్ట నిర్మించారు. ఈ క్రమాన పట్టణంలోని మురుగు నీరు గోదావరిలో కలిసేలా ఆరు చోట్ల స్లూయిస్ గేట్లు బిగించారు. ఈ గేట్ల సగటు ఎత్తు 38 అడుగులుగా ఉంది. సాధారణ రోజుల్లో ఎలాంటి ఆటంకం లేకుండా పట్టణంలోని మురుగు నీరు గోదావరిలో కలుస్తోంది. కానీ గోదావరి వరద నీటి మట్టం 38 అడుగులకు చేరగానే పరిస్థితులు తారుమారు అవుతున్నాయి. మురుగు నీరు గోదావరిలో కలవడం మాటేమో కానీ.. వరద నీరే స్లూయిస్‌ల ద్వారా పట్టణంలోకి చేరుతోంది. దీంతో వరద నీటి మట్టం 35 అడుగులకు చేరగానే మురుగునీరు వెళ్లే స్లూయిస్ గేట్లు మూసేస్తారు. ఆపై మురుగు నీటిని మోటార్ల ద్వారా గోదావరిలోకి ఎత్తిపోస్తారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. ఇటు వరద, అటు పట్టణంలో వర్షం ఒకేసారి కురిస్తే నీటిని ఎత్తిపోయడం సాధ్యం కాక మురుగు, వర్షపు నీరు కలిసిన వరద.. కరకట్ట నుంచి వెనక్కి తన్ని ఆలయ పరిసరాలను ముంచెత్తడం సర్వసాధారణంగా మారుతోంది.

ఏ ఇబ్బందీ లేకుండా..

సాధారణంగా భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరక ముందే మురుగునీటి పారుదల వ్యవస్థకు సంబంధించి స్లూయిస్ గేట్లు మూసేస్తారు. దీంతో సీతారామచంద్రస్వామి కొలువైన భద్రగిరులు, పోకల దమ్మక్క నిత్యాన్నదానసత్రం, విస్తా కాంప్లెక్స్ పరిసరాలు నీటిలో చిక్కుకుపోతాయి. కానీ ఈసారి ఇంచుమించు మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరినా ఎక్కడా వరద తాలుకూ ఆనవాళ్లు కనిపించలేదు. ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు ఆలయం చుట్టూ రాకపోకలు సాగించగా.. చిరువ్యాపారుల కార్యకలాపాలు సాఫీగా కొనసాగాయి. అయితే, గోదావరికి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిలో వరద వచ్చినా పట్టణంలో భారీ వర్షం లేకపోవడంతో రోజువారీ డ్రెయినేజీ నీరు ఎత్తిపోతలతో సమస్య రాలేదు. కానీ గడిచిన వారంలో భద్రాచలంలో భారీ వర్షం కురిస్తే ఆలయ పరిసరాల్లో మురుగు ముంపు సమస్య ఎదురయ్యేది.

కొత్త డ్రెయినేజీ వ్యవస్థతోనే..

ప్రతీసారి వరద వచ్చినప్పుడు వర్షాలు కురిసే అవకాశం లేదని భావించలేం. అందుకే మురుగు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భద్రాద్రి వాసులు, రాష్ట్ర వ్యాప్తంగా రామయ్య భక్తులు డిమాండ్ చేస్తున్నారు. భద్రాచలంలో ఎంత వర్షం పడినా నీరు సాఫీగా పల్లపు ప్రాంతాలకు వెళ్లేలా కొత్త డ్రెయినేజీ వ్యవస్థను అందుబాటులోకి తేవాలంటున్నారు. అలాగే, ప్రస్తుతం స్నాన ఘట్టాలకు ఎగువన వంద మీటర్ల లోపే స్లూయిస్‌ల ద్వారా మురుగునీరు గోదావరిలో కలుస్తోంది. భద్రాద్రి క్షేత్రానికి ఉన్న ప్రాముఖ్యత, ఆలయ పవిత్రతను దృష్టిలో ఉంచుకుని సరికొత్త డ్రెయినేజీ వ్యవస్థతో పాటు మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ వస్తోంది. మురుగు నీటి శుద్ధితో స్నాన ఘట్టాల వద్ద మురుగునీరు పారకుండా ఉంటుంది.

మూడో హెచ్చరిక స్థాయికి వరద..

ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటలకు భద్రాచలం దగ్గర గోదావరిలో వరద నీటి మట్టం 38.20 అడుగులకు చేరింది. ఆ తర్వాత గంటగంటకూ పెరుగుతూ 43 అడుగులకు చేరగానే మొదటి, 48 అడుగుల వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఇక 21న సాయంత్రం 8 గంటలకు 51.90 అడుగుల మేర వరద చేరింది. ఆ సమయంలో 13.66 లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో వేగంగా దిగువకు ప్రవహిస్తూ వెళ్లింది. ఇంకో 60 వేల క్యూసెక్కుల వరద వస్తే మూడో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యేది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించాల్సి వచ్చేది. కానీ 21వ తేదీ రాత్రి 9గంటల నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ కాకపోగా.. రెండో హెచ్చరిక కూడా ఎత్తేశారు.

కనకగిరి గుట్టలపై కలెక్టర్



తనయుడితో కలిసి కలెక్టర్ జితేష్ వి పాటిల్

చండ్రుగొండ : విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ జితేష్ వి పాటిల్ తన తనయుడు రాఘవ్ వి పాటిల్‌తో కలిసి ఆదివారం కనకగిరి గుట్టలు ఎక్కారు. గుట్ట కింద నుంచి ఉదయమే కాలినడక వెళ్లి హస్తాల వీరన్నస్వామిని దర్శించుకున్నారు. అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా ప్రవహించే వాగు, చెక్‌డ్యాం వద్ద తనయుడితో కలిసి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ ప్రాంతంలో ఉన్న చెట్లు, అహ్లాదపరిచే ప్రకృతిని కుమారుడికి వివరించారు. వారి వెంట దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, నాయకులు భోజ్యానాయక్, నాగరాజు ఉన్నారు.

2 కే రన్‌కు అనూహ్య స్పందన



2 కే రన్‌ను ప్రారంభిస్తున్న డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం కొత్తగూడెంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2 కే రన్‌కు అనూహ్య స్పందన లభించింది. స్థానిక పోస్టాఫీస్ సెంటర్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ రైల్వే స్టేషన్ వరకు సాగింది. ఈ సందర్భంగా డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో క్రీడలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన ధ్యాన్‌చంద్ ప్రతీ క్రీడాకారుడికి ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో జేబీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్, కోచ్‌లు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

■ ఆకాశం.. అరుణ వర్ణ శోభితం



సాయం సంధ్యవేళ ఆకాశం అరుణ వర్ణ శోభితమై చక్కటి అందాలు సంతరించుకుంది. ములకలపల్లి మండలం కమలాపురం గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం ప్రకృతి గీసిన చిత్రంలా కనిపించిన ఈ సుందర దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో బంధించింది. – ములకలపల్లి

'ఉపాధి' కౌజులు..!



శేషగిరినగర్‌లోని కౌజు పిట్ట పెంపకం కేంద్రం, కేంద్రంలో పిట్టలను పరిశీలిస్తున్న స్థానికులు

- కౌజుపిట్ట మాంసానికి ఎంతో ప్రత్యేకత
- మహిళా సంఘాల ఆధ్వర్యాన పెంపకం
- తొలిసారిగా పైలట్ ప్రాజెక్టుగా శేషగిరినగర్
- జిల్లా అంతటా ఏర్పాటు చేసేలా కసరత్తు
- పెట్టుబడి తక్కువ.. ప్రయోజనాలు ఎక్కువ

కొత్తగూడెంఅర్బన్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను వివిధ వ్యాపారాలు చేసేందుకు ప్రోత్సహిస్తూ రుణాలు విడుదల చేస్తోంది. ఇందులో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్ గ్రామపంచాయతీని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి దుర్గాంబిక ఎస్‌హెచ్‌జీ, అరుణోదయ గ్రామ సమాఖ్య ఆధ్వర్యాన ప్రణజ కౌజు పిట్టల పెంపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే కౌజుపిట్టల పెంపకం సజావుగా సాగి ఆశించిన విధంగా అమ్మకాలు జరిగితే జిల్లాలోని ప్రతీ మండలంలో ఏర్పాటు చేసేలా అధికారులు నిర్ణయించారు. దీంతో అన్ని మండలాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యాన పెంపకాలు ప్రారంభించే అవకాశం ఉంది.

మార్కెట్‌లో మంచి డిమాండ్..

హోటళ్లు, రెస్టారెంట్లలో కౌజుపిట్టల మాంసానికి మంచి డిమాండ్ ఉంది. దీంతో వీటి పెంపకం, అమ్మకాలు చేయడంతో మంచి లాభాలు గడించే అవకాశం ఉంటుందని డీఆర్‌డీఏ, మహిళా సంఘాల అధికారులు అభిప్రాయపడుతున్నారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ ప్రయోజనాలు ఉండడంతో ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తుండగా.. మహిళా సంఘాల ఆధ్వర్యాన పెంపకం జరుగుతున్న నేపథ్యాన హోటళ్లు, రెస్టారెంట్ల వారు కూడా నమ్మకంతో వాటిని కొనుగోలు చేసి ఆహారప్రియులకు అందించే అవకాశం ఉంటుంది.

పెంపకం, ఖర్చు ఇలా...

పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన శేషగిరినగర్‌లో గత రెండు రోజుల క్రితం రూ.8వేలతో 600 పిల్లలు కొనుగోలు చేసి పెంపకాన్ని మొదలుపెట్టారు. 25 నుంచి 30 రోజుల్లో ఇవి పెరగనుండగా.. వాటిని అమ్మి వేయొచ్చని, అదే 40 రోజులు అయితే గుడ్లు పెట్టే అవకాశాలుంటాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కాగా, పెంపకానికి కావాల్సిన షెడ్, అవి తినే ఆహారం, వాటి ఖర్చు మొత్తం కలిపి రూ.60 వేలకు పైన అయ్యిందని, ఇందులో రూ.30 వేల వరకు మహిళా సంఘం నుంచి రాగా, మరో రూ.30 వేలు నిర్వాహకులే భరించినట్లు చెబుతున్నారు. వీటిని ధర జత రూ.200 వరకు పలకనుంది.

ఆరోగ్యానికి చేసే ఉపయోగాలు...

కౌజు పిట్ట మాంసంలో అధిక ప్రోటీన్లు, తేలికగా జీర్ణమవడం, రక్తహీనత, బలహీనత, పునరుత్పత్తి సామర్థ్యం మెరుగవడం, కొవ్వు తక్కువ ఉండడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. సాధారణంగా గ్రామాలు, పట్టణాలు, వ్యవసాయ క్షేత్రాల్లో వీటిని పెంచేందుకు అనువైన స్థలాలు ఉండగా.. గాలి, వెలుతురు ఉండే ప్రాంతాలు, డాబాపైన కూడా వీటిని పెంచవచ్చు. వీటికి 30 రోజుల పాటు గోధుమలు, బియ్యం, జొన్న, సజ్జ, మినుములతో కూడిన ఆహారాన్ని అందించి, ప్రతి రోజు అవి పెరిగే పరిసరాలను శుభ్రపరిస్తే ఎటువంటి వ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా పెరుగుతాయి. పిట్టలు చనిపోకుండా సరైన టీకాలు వేయించి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరముంది.

జిల్లాలోనే తొలిసారిగా..



జిల్లాలోనే తొలిసారిగా కౌజు పిట్టల పెంపకం చేపట్టాం. వీటి మాంసానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో మహిళా సంఘాల ఆధ్వర్యాన పెంపకం చేపట్టాం. వీటిని తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రభుత్వం, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– ఆర్.ప్రణజ, కేంద్ర నిర్వాహకులు

జోరుగా వన మహోత్సవం

- జిల్లాలో లక్ష్యానికి చేరువలో కార్యక్రమం
- ఈ ఏడాది 71.41 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- ఇప్పటికే నాటిన మొక్కలు 80 శాతం



వనమహోత్సవంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

చుంచుపల్లి: జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వన మహోత్సవం కార్యక్రమం జోరుగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సంవత్సరం జిల్లాలో 71.41 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం గతేడాది అక్టోబర్ నుంచి జిల్లాలో 481 హరిత, మరో 32 అటవీ శాఖ నర్సరీల్లో 20 రకాల మొక్కలు పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏడాది జూలైలో వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈసారి కూడా జూలై రెండో వారం నుంచే గ్రామాలు, పట్టణాల్లోని ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో పలు శాఖలు ముందు వరుసలో నిలవగా, కొన్ని శాఖలు మాత్రమే లక్ష్య సాధనలో కొంత వెనుకబడ్డాయి. ఆగస్టు మొదటి వారం నుంచి వన మహోత్సవం జోరందుకోవడంతో పలు శాఖలు లక్ష్యాలను చేరుకున్నాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం సైతం తొందరగానే ముగియనుందని భావిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 80.20 శాతం అంటే.. 57.27 లక్షల మొక్కలు నాటారు. ఇంకా 1,41,4031 మొక్కలు నాటాల్సి ఉంది.

లక్ష్యానికి చేరువలో శాఖలు..

కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ, అశ్వారావుపేట మున్సిపాలిటీలతో పాటు జిల్లాలో 471 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో జూలై నుంచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. వివిధ ప్రభుత్వ శాఖల వారీగా మొక్కలు పంపిణీ చేసి నాటించే లక్ష్యాలను కేటాయించారు. ఈసారి వన మహోత్సవ లక్ష్యసాధనలో డీఆర్‌డీఏ, అటవీశాఖ, టీజీఎఫ్‌డీసీ, ముందు వరసలో నిలిచాయి. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 130.27 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. డీఆర్‌డీఏ శాఖకు 30 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, 106.86 శాతంతో ఇప్పటి వరకు 32.05 లక్షల మొక్కలు నాటారు. టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో 12.90 లక్షల మొక్కలకు గాను 78.21 శాతంతో 10.08 లక్షల మొక్కలు నాటారు. ఇల్లెందు మున్సిపాలిటీలో 37.72 శాతం, మణుగూరులో 22.95 శాతం మాత్రమే మొక్కలు నాటారు. ఇక సింగరేణి సంస్థ తమ పరిధిలోని ఏరియాల్లో 58.35 శాతంతో 1.92 లక్షల మొక్కలు నాటింది. వ్యవసాయ శాఖ సైతం 85.26 శాతంతో 4.26 లక్షల మొక్కలు నాటింది. పాఠశాల విద్యా శాఖ, సంక్షేమ, వైద్యారోగ్య, మార్కెటింగ్, సహకార శాఖ, విద్యుత్ శాఖలు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటివరకు నాటిన 57.27 లక్షల మొక్కలకు గానూ 20.44 లక్షల మొక్కలకు అధికారులు జియో టాగింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఇందులో ఒక్క డీఆర్‌డీఏకు చెందిన మొక్కలే అత్యధికంగా 14.32 లక్షల వరకు ఉన్నాయి. వన మహోత్సవంలో నాటుతున్న మొక్కలకు సంరక్షణ చర్యలను అటవీశాఖ చేపడుతోంది.

నెలాఖరు వరకు లక్ష్యాలు పూర్తి



వనమహోత్సవలో భాగంగా ఈ ఏడాది జోరుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. జిల్లాలో అన్ని శాఖలు ఉత్సాహంగా ఈసారి వన మహోత్సవంలో పాల్గొంటున్నాయి. ఈ ఏడాది నిర్దేశించిన 71.41 లక్షల మొక్కల టార్గెట్‌లో ఇప్పటివరకు 57.27 లక్షల మొక్కలు నాటారు. భద్రాద్రిని హరిత జిల్లాగా తీర్చిదిద్దడమే అటవీ శాఖ ప్రధాన లక్ష్యం.

– కిష్టాగౌడ్, డీఎఫ్ఓ

నేటి నుంచి 'ఉల్లాస్' శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: నవభారత్ సాక్షరతా కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో ఉల్లాస్ మండల స్థాయి శిక్షణ కార్యక్రమం సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు డీఈఓ బి.నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 38,310 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన 3,810 మంది వలంటీర్లకు గ్రామపంచాయతీ స్థాయిలో 28న శిక్షణ ఇవ్వనున్నామని, ఈ మేరకు ముందుగా మండల స్థాయిలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతీ గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరు రిసోర్స్‌పర్సన్లు(ఒక ఉపాధ్యాయులు, ఒక వీఓఏ) హాజరు కానున్నారని, ఈ కార్యక్రమానికి జిల్లా సమన్వయకర్తగా ఎస్.కె.సైదులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

బాలికల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

ఉమ్మడి జిల్లా గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి



బాలికకు సర్టిఫికెట్ అందిస్తున్న అరుణకుమారి

కొణిజర్ల: బాలికలను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్ది, వారి సర్వతోముఖాభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్(ఆర్‌సీఓ) అరుణకుమారి అన్నారు. మండలంలోని తనికెళ్ల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఆదివారం డిగ్రీ ప్రథమ సంవత్సర బాలికలకు స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరుణకుమారి మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌లో పట్టు సాధించాలని సూచించారు. బాలికల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశ పెడుతోందని, గురుకులాల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదవాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలికల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కె. రజని అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు కె.పి. ఐశ్వర్య, ఎ.దీప్తి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ కె.రజిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యమకారుల డిమాండ్లు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాంతిరామ్

కొత్తగూడెంఅర్బన్: 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతిరామ్ అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులందరికీ 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, హెల్త్‌కార్డులు, ఆర్టీసీ బస్‌పాస్‌లు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. చాలామంది ఉద్యమకారులు అనారోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్నారని, వారికి ఇప్పటికైనా సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో వందనపు సూర్యప్రకాష్, గెర్సోము, గఫార్, సారయ్య, కనకయ్య, నరేంద్రుల ఉపేందర్ రావు, నర్సింహారావు, శేషంరాజు, గౌతం, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో కొట్టుకొచ్చిన గేదె సురక్షితం

- రక్షించిన ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక పోలీసులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నదిలో ఎగువ నుంచి కొట్టుకొస్తున్న ఓ గేదెను ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది ఆదివారం సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వివరాలిలా.. ఆదివారం గోదావరిలో ఓ గేదె కొట్టుకొస్తుండగా.. గమనించిన ఎన్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ అధికారులు వెంటనే లాంచీ ద్వారా వెళ్లి తాళ్లసాయంతో దాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం దానికి వైద్య పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం లీడింగ్ ఫైర్ ఫైటర్ సాధిక్, ఎన్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, పశువైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ బోర్డు నిర్వహణపై కార్మికుల ఆందోళన



మాట్లాడుతున్న మాదవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): మెడికల్ బోర్డు నిర్వహణపై కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వెంటనే ఈ బోర్డును రద్దు చేసి మరో బోర్డు నిర్వహించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని ఏబీకేఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాదవ నాయక్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని మిలీనియం డీ కాలనీ కార్మిక వాడల్లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. గత నెలాఖరులో నిర్వహించిన రిఫరల్ బోర్డులో 54 మంది హాజరు కాగా అందులో 5గురిని అన్‌ఫిట్ చేయడంతో సుమారు 9 నెలల పాటు వారు విధులకు వెళ్లలేదన్నారు. గుండె, కిడ్నీ, పెరాలసిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారిని ఎలాంటి ఆధారాలతో ఫిట్ చేశారో యాజమాన్యం స్పష్టత ఇవ్వాలన్నారు. సర్వీస్ నిబంధనలు లేకుండా అందరినీ ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఉపాధ్యక్షులు రాంసింగ్, జీవీ కృష్ణారెడ్డి, మొగిలిపాక రవి, కె.ప్రకాశ్, చంద్రశేఖర్, రేణుక, ఇనపనూరి నాగేశ్వరరావు, శ్రవన్‌కుమార్, ధరావత్ నాగేశ్వరరావు, రాజేష్, వడ్డీకాసులు, గోపీకృష్ణ, సుధాకర్, ఎండీ కాలనీ వాసులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోటవేటర్ కింద పడి బాలుడి దుర్మరణం

కూసుమంచి: మండలంలోని లోక్యాతండా శివారు కొత్తతండాలో రోటవేటర్ కిందపడి ఓ బాలుడు దుర్మ రణం చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. తండాకు చెందిన వడిత్యారాంబాబు తనట్రాక్టర్ రోటవేటర్‌తో దుక్కి దున్నేందుకు వెళ్లాడు. అతడి ఆరేళ్ల కుమారుడు భువనేశ్వర్‌ను ట్రాక్టర్‌పై ఎక్కించుకుని దుక్కిదున్నుతుండగా బాలుడు ప్రమాదవశాత్తు రోటవేటర్ కింద పడి మృతిచెందాడు. కళ్లముందే కన్న కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు వద్ద గల ఓ వెంచర్‌లో గడ్డిమందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కూసుమంచి మండలం జీళ్లచెర్వుకు చెందిన అంబాల భాస్కర్ (28) డిగ్రీ వరకు చదువుకున్నాడు. కొంతకాలం ఖమ్మంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పని చేశాడు. ఆ ఉద్యోగం మానేసి ప్రస్తుతం వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఈ నెల 14న వెంచర్‌లో గడ్డిమందు తాగాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆయన్ను ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి బక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

ఐటీఐతో ఉపాధి అవకాశాలు

- విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా మార్పులు
- సకల సౌకర్యాలతో సిద్ధమైన ఖమ్మం ఐటీఐ
- ఈనెల 28వరకు ప్రవేశాలకు కౌన్సెలింగ్



కళాశాలలో బోధనకు సమకూర్చిన పరికరాలు



ఐటీఐ ప్రాంగణం, (ఇన్‌సెట్) ఐటీఐ కళాశాల ముఖద్వారం

ఖమ్మం సహకారనగర్: ఐటీఐ కోర్సులతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయనే విశ్వాసాన్ని విద్యార్థుల్లో కల్పించేలా ప్రభుత్వం, అధికారులు, ఐటీఐ కళాశాల బాధ్యులు కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో 65 ప్రభుత్వ ఐటీఐ కళాశాలలుండగా... గత ఏడాది వీటిని అడ్వాన్స్‌డ్ ట్రెనింగ్ సెంటర్లు (ఏటీసీ)గా మార్పు చేయాలని నిర్ణయించారు. తొలి దశలో రాష్ట్రంలోని మూడు కళాశాలలను మోడల్ ఏటీసీగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈ జాబితాలో ఖమ్మంలోని టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఉంది. ఇక నూతనంగా ప్రభుత్వం తెలంగాణ గేట్ ఫర్ అడాప్టింగ్ అండ్ ట్రెనింగ్ ఎంప్లాయ్‌మెంట్ (టీ–గేట్) విధానాన్ని ప్రవేశపెట్టింది. టీ–గేట్‌తో ఐటీఐ (ఏటీసీ)లో ప్రాంగణ నియామకాలు పెంచి విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా కృషి చేయనున్నారు.

టీ–గేట్‌తో ఉపాధి..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ–గేట్‌తో ఐటీఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించనున్నాయి. తెలంగాణ గేట్‌ఫర్ అడాప్టింగ్ అండ్ ట్రెనింగ్ ఎంప్లాయ్‌మెంట్ (టీ–గేట్) పథకం ద్వారా జిల్లాలోని పరిశ్రమల్లో విద్యార్థులకు ఉద్యోగ కల్పన చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రధాన పరిశ్రమ లేదా సంస్థ డైరెక్టర్, సీఎండీ స్థాయి అధికారి కమిటీ చైర్మన్‌గా, కార్మిక విభాగం అధికారి వైస్ చైర్మన్‌గా, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కన్వీనర్‌గా ఉంటారు. ఈ కమిటీ జిల్లాలోని పరిశ్రమల్లో ఉన్న ఖాళీలను గుర్తించి.. ఐటీఐ విద్యార్థులతో భర్తీ చేసేలా ప్రణాళిక రూపొందిస్తుంది. దీనిద్వారా పరిశ్రమల్లో ఖాళీలు భర్తీ కావడంతోపాటు విద్యార్థులకు ఉద్యోగాలు దక్కుతాయి. అలాగే పరిశ్రమల్లో ఖాళీలు భర్తీ చేసినందుకు గాను ఆయా పరిశ్రమలు సీఎస్‌ఆర్ పథకం కింద ఐటీఐ కళాశాలలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాయి. అలాగే పరిశ్రమల్లో అవసరమైన అర్హతలు కలిగిన ఉద్యోగి ఐటీఐల్లో లేకపోతే.. అలాంటి విభాగాల్లో ప్రత్యేకంగా ఐటీఐలో శిక్షణ అందించి ఆయా ఖాళీలను భర్తీ చేసే బాధ్యతను ఐటీఐలు తీసుకుంటాయి. దీని ద్వారా ఐటీఐతో విద్యార్థులకు మంచి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ టీ–గేట్ పనిచేస్తోంది. నగరంలోని ఏటీసీ కేంద్రంలో విద్యార్థులకు ఉపయోగపడే కోర్సులకు సంబంధించిన సామగ్రి అంతా చేరడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కొనసాగుతున్న ప్రవేశాలు

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏడు కోర్సులు ఉండగా... వీటిలో కోర్సు ఆధారంగా విద్యార్థుల ప్రవేశాలు ఉంటున్నాయి. అన్ని కోర్సులకు సంబంధించి 172 సీట్లకు గాను 166 భర్తీ అయ్యాయి. ఇక ఏటీసీలో గతఏడాది 172సీట్లకు గాను అన్నీ భర్తీ అయ్యాయి. ఈ విద్యా సంవత్సరంలో 172 సీట్లకు 165 సీట్లు ఇప్పటికే భర్తీ అయ్యాయి.

కొత్తగా వాక్ ఇన్ అడ్మిషన్

ఐటీఐల్లో ప్రవేశాల ప్రక్రియ రెండో దశ ముగిసింది. కొత్తగా వాక్ ఇన్ అడ్మిషన్ పేరుతో ప్రవేశాలు కల్పించేందుకు నిర్ణయించారు. ఈమేరకు అర్హత కలిగిన అభ్యర్థులు 28వ తేదీ వరకు ప్రతిరోజు 11 గంటల్లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని కళాశాలల్లో దరఖాస్తు ఫారంతో పాటు ఒరిజనల్ సర్టిఫికెట్లు సమర్పిస్తే పరిశీలించి ఖాళీల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

ప్రవేశాలకు ముమ్మర ప్రయత్నాలు

ఇటీవల టీ–గేట్ బృందం ప్రవేశాల పెంపు, కావాల్సిన సౌకర్యాలు, ఉపాధి అవకాశాలపై సమీక్ష నిర్వహించింది. ఇందులో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించి అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి ఆయా అంశాలను వివరించారు. ఇదిలా ఉండగా కలెక్టర్ అనుదీప్ ఇటీవల ఐటీఐని సందర్శించి పలు సూచనలు చేశారు. అంతకు ముందు కలెక్టరేట్, కేఎంసీల్లో అదనపు కలెక్టర్ శ్రీజ ఐటీఐల్లో ప్రవేశాల పెంపునకు అధికారులతో చర్చించారు.

మెరుగైన ఉపాధి అవకాశాలు



ఐటీఐ విద్యను అభ్యసించడం వల్ల విద్యార్థులకు చదువుతోపాటే ఉపాధి అవకాశాలు లభించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు విద్యను అభ్యసించి ఉపాధి అవకాశాలు చూపించగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం టీ–గేట్ ఏర్పాటు చేసింది. దీనివల్ల విద్య, ఉపాధితోపాటు కళాశాలలో అవసరమైన సదుపాయాలు సైతం సమకూరడంతో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభించనున్నాయి.

– ఎ.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, టీ–గేట్ కన్వీనర్

ఈవీ.. రయ్ రయ్!



పర్యావరణానికి హితం..

ఎలక్ట్రిక్ వాహనాలు బ్యాటరీల ద్వారా విద్యుత్‌శక్తితో నడుస్తాయి. వీటికి ఇంజన్లు ఉండవు. దీంతో వాయుకాలుష్యం చాలా తక్కువ. పర్యావరణ హితంగా ఉంటాయి. వీటిలో ఎటువంటి కాలుష్యాన్ని ఉత్పత్తి చేయని మోటార్ ఉంటుంది. ప్రస్తుత కాలంలో వాయుకాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ వాహనాలు పెరగడం ద్వారా వాతావరణ కాలుష్యం నివారించేందుకు వీలవుతుంది. ఇక వాహనాల నుంచి అతి తక్కువ శబ్దం రావడంతో పాటు ప్రయాణం చాలా మృదువుగా సాగుతుంది.

చార్జింగ్ స్టేషన్ల కొరత..

ఈ వాహనాలను చార్జింగ్ చేసేందుకు స్టేషన్ల కొరత ఉంది. రాష్ట్రంలో అతి తక్కువ ప్రాంతాల్లోనే చార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇక జిల్లాలో ఈ చార్జింగ్ స్టేషన్లు అసలే లేవు. దీంతో వాహనాలను కొనుగోలు చేసిన వారు ఇంటివద్దే చార్జింగ్ పెట్టుకోవాల్సి వస్తోంది. మధ్య మధ్య చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో ఎక్కువ దూరం ఈ వాహనాలపై ప్రయాణించలేకపోతున్నారు. అయితే రానున్న కాలంలో పలు ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వాహనాల సంఖ్య పెరిగితే చార్జింగ్ స్టేషన్లు కూడా అనివార్యంగా రానున్నాయి. స్టేషన్లు ఏర్పాటు చేస్తే తక్కువ సమయంలో ఎక్కువ చార్జింగ్ అయ్యే అవకాశం ఉంటుంది. ఇంట్లో వాహనాలకు చార్జింగ్ పెట్టాలంటే ఎక్కువ సమయం పడుతోందని యజమానులు చెబుతున్నారు.

ఖమ్మం జిల్లాలో పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు

- టూ వీలర్ నుంచి పెద్ద వాహనాల వరకు..
- 11 ఏళ్లలో నాలుగు వేల వెహికిల్స్
- పర్యావరణ హితం కావడంతో సర్కారు ప్రోత్సాహం
- చార్జింగ్ స్టేషన్లు ఉంటే మరింతగా పెరగనున్న వాహనాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇటీవలి కాలంలో వీటి ప్రయోజనాలు తెలుసుకునేందుకు వాహనదారులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గతంలో పలు కారణాలతో ఈ వాహనాల కొనుగోళ్లు ఆశాజనకంగా లేవు. అయితే క్రమంగా సంప్రదాయ వాహనాలతోపాటు వీటికి కూడా డిమాండ్ ఏర్పడుతోంది. జిల్లాలో ప్రస్తుతం అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలు కలిపి 4,044 ఉన్నాయి. వీటిలో టూ వీలర్ల నుంచి పెద్ద వాహనాల వరకు ఉన్నాయి. ప్రధానంగా ఈ వాహనాలతో పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. అయితే చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో ఇబ్బంది అవుతోందని వినియోగదారులు అంటున్నారు. ఈ స్టేషన్లు ఏర్పాటైతే ఎలక్ట్రికల్ వాహనాల మార్కెట్ మరింతగా పెరిగే అవకాశం ఉంది.

ఈ వాహనాలకు రాయితీ..

ఎలక్ట్రికల్ వాహనాల్లో పలు రకాలున్నాయి. బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు బ్యాటరీతో మాత్రమే పనిచేస్తాయి. హైబ్రీడ్ ఎలక్ట్రిక్ వాహనాలకు పెట్రోల్ ఇంజన్, బ్యాటరీ రెండూ ఉంటాయి. ప్లగ్ ఇన్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాలు ప్లగ్ ఇన్ ద్వారా చార్జ్ చేయగల బ్యాటరీలను కలిగి ఉంటాయి. సంప్రదాయ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రికల్ వాహనాల ధర ఎక్కువగానే ఉంది. అయితే ఈ వాహనాలు కొనుగోలు చేస్తున్న వారికి రవాణా శాఖ పలు రాయితీలు కల్పిస్తోంది. వీటికి లైఫ్ ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం ఉండదు. అలాగే రిజిస్ట్రేషన్ ఫీజు కూడా లేదు.

4,044 వాహనాలు..

జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య గతంతో పోలిస్తే భారీగా పెరిగింది. ఒకప్పుడు ఈ వాహనాల కొనుగోలుకు అనేక అనుమానాలు వ్యక్తం చేసిన ప్రజలు.. ప్రస్తుతం కొంత ఆసక్తి చూపుతున్నారు. రవాణా శాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వివరాల ప్రకారం.. జిల్లాలో హెవీ, మీడియం, లైట్ ఎలక్ట్రికల్ వెహికిల్స్ మూడు ఉన్నాయి. ఇక త్రీ వీలర్ గూడ్స్ వాహనాలు 22 ఉన్నాయి. మోటారు సైకిళ్లు, స్కూటర్లు 3,731 ఉన్నాయి. టీజీఎస్ ఆర్టీసీ పలు జిల్లాల్లో ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టింది. అయితే చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో ఇంకా ఖమ్మం రీజియన్‌కు ఈ బస్సులు రాలేదు. ఇక జిల్లాలో సంప్రదాయ వాహనాలు 6,35,951 ఉన్నాయి. ఇందులో అధికంగా మోటారు సైకిళ్లు 4,60,476 ఉన్నాయి. అలాగే కార్లు 46,143 ఉన్నాయి. ఆటోలు 32,672 ఉన్నాయి.

వివాహిత అనుమానాస్పద మృతి..!

భర్తతో సహా మరో ముగ్గురిపై కేసు నమోదు



లక్ష్మీప్రసన్న (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఓ వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై ఆదివారం ఆమె భర్తతో పాటు మరో ముగ్గురిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక ఎస్సైటి.యయాతీ రాజు కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ముచ్చవరం గ్రామ పంచాయతీ విశ్వనాథపురం గ్రామానికి చెందిన పూల లక్ష్మీప్రసన్న(33)కు, మండలంలోని ఖాన్‌ఖాన్‌పేటకు చెందిన పూల నరేష్‌బాబుతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమార్తె, ఒక కుమారుడు ఉన్నాడు. కాగా, గత కొన్నేళ్లుగా వీరిమధ్య కుటుంబ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ గొడవల నేపథ్యంలోనే మూడేళ్ల క్రితం నరేష్‌బాబు తన సొంత అక్క దాసరి విజయలక్ష్మి స్వగ్రామమైన అశ్వారావుపేట పట్టణంలోని కోనేరుబజార్‌లో ఉన్న ఇంట్లో కలిసి ఉంటున్నారు. ఈక్రమంలో ఆదివారం తెల్లవారుజామున లక్ష్మీప్రసన్న ఇంట్లో పనిచేస్తుండగా జారిపడి తల, నుదిటి భాగాల్లో గాయపడినట్లు ఆమె కుటుంబీకులకు భర్త సమాచారం ఇచ్చి స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు ఏపీలోని రాజమండ్రికి రిఫర్ చేయగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

మృతిపై అనుమానాలు..?

లక్ష్మీ ప్రసన్న కిందపడి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు భర్త నరేష్‌బాబు, అతడి బంధువులు ఇచ్చిన సమాచారంతో మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు రాజమండ్రిలోని ఆస్పత్రికి వెళ్లారు. ఆస్పత్రిలో ఐసీయూ విభాగంలో వెంటిలేటర్‌పై విగతజీవిగా పడిఉన్న లక్ష్మీప్రసన్న శరీరంపై ఉన్న గాయాలతో పాటు శారీరకంగా కుశించుకుపోయి కనిపించడంతో మృతిపై అనుమానాలు వచ్చాయి. దీంతో తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నట్లు తండ్రి ముదిగొండ వెంకటేశ్వరరావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో ఆమె భర్తతో పాటు పూల విజయలక్ష్మి, దాసరి భూలక్ష్మి, దాసరి శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు అద్దాలు ధ్వంసం..

దుమ్ముగూడెం: మండలంలోని అంజిపాక గ్రామానికి చెందిన కొడిమి దుర్గాప్రసాద్‌కు చెందిన ఎర్టికా కారు అద్దాలను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దుర్గాప్రసాద్ తన ఇంటి ముందు షెడ్డులో కారు నంబర్ టీఎస్28ఎం 6654ను ఉంచగా.. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కారు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

కారు చోరీ కేసులో అరెస్ట్..



నిందితులతో సీఐ నాగబాబు, ఎస్‌ఐ రంజిత్

మణుగూరుటౌన్: మండలంలోని ఆదర్శనగర్‌లో ఓ వ్యాపారి కారును పార్క్ చేయగా చోరీ చేసిన గుర్తుతెలియని వ్యక్తులను మణుగూరు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సీఐ నాగబాబు కథనం ప్రకారం.. ఈ నెల 13న మహ్మద్ ఫిరోజ్ తన కారు ను ఆదర్శనగర్‌లో పార్క్ చేయగా.. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మణుగూరు సుందరయ్యనగర్‌కు చెందిన లారీ మెకానిక్ షేక్ కరంతుల్ల, చెరువు ముందు సింగారానికి చెందిన లారీ డ్రైవర్ షేక్ నాజీర్‌లను అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. వీరు జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కారు చోరీ చేసినట్లు తెలిపి రిమాండ్‌కు తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

గుండాల: మండలంలోని మామకన్ను కాచనపల్లి అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆళ్లపల్లి పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఎస్సై సోమేశ్వర్ కథనం ప్రకారం.. ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కాచనపల్లి అటవీ ప్రాంతం నుంచి పోలారం గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లు ఇసుక లోడ్‌తో వెళ్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

గోపాల కృష్ణుడి లీలలు అంతా ఇంత కాదయా..

- ఫేక్ అటెండెన్స్‌లో అందరికీ సుపరిచితుడు
- తాజాగా నకిలీ మద్యం కేసులో ఏ1గా అరెస్టు, రిమాండ్



మహబూబాబాద్లో నకిలీ మద్యం కేసులో అరెస్టయిన కార్యదర్శి(ఫైల్), (ఇన్‌సెట్) కార్యదర్శి గోపాలకృష్ణ(ఫైల్)

టేకులపల్లి: మండలానికి చెందిన ఓ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంతో పాటు ఫేక్ అటెండెన్స్‌లో సుపరిచితుడు. తాజాగా అక్రమ సంపాదన కోసం నకిలీ మద్యం వ్యాపారం చేస్తూ పోలీసులకు దొరికిపోయాడు. వివరాల్లోకి వెళితే..

మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పెద్ద కిష్టాపురం గ్రామానికి చెందిన ఒర్సు గోపాలకృష్ణ 2017లో టేకులపల్లి మండలం తడికలపూడి పంచాయతీ గ్రేడ్–3 కార్యదర్శిగా విధుల్లో చేరాడు. రెండేళ్ల క్రితమే కోయగూడెం పంచాయతీకి బదిలీ అయి డిప్యూటేషన్‌పై తిరిగి తడికలపూడికి రావడంతో పాటు దాసుతండా పంచాయతీకి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే ఈనెల 18న మండలంలో మంత్రి పొంగులేటి పర్యటనలో భాగంగా తడికలపూడి పంచాయతీలో బీటీ రోడ్డు శంకుస్థాపన రోజు కనిపించిన సదరు కార్యదర్శి మరుసటి రోజు నుంచి విధులకు హాజరు కాలేదు. 20న తన పిల్లలకు డెంగీ జ్వరం వచ్చిందని విధులకు రాలేనని అధికారులకు ఫోన్ ద్వారా తెలిపినట్లు సమాచారం. 22న తడికలపూడి, దాసుతండాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభలకూ రాకపోవడంతో సమీప పంచాయతీ కార్యదర్శులతో ఎంక్వైరీ చేయాల్సి వచ్చింది.

కార్యదర్శి లీలలు..

- జిల్లా వ్యాప్తంగా 42 మంది కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్‌లో దొరికితే.. అందులో సదరు కార్యదర్శి గోపాలకృష్ణ ఏకంగా 21 రోజుల పాటు తన నైపుణ్యం ప్రదర్శించాడు.
- మండలంలో మిషన్ భగీరథతో పాటు రోడ్లు, కాల్వల నిర్మాణాలకు కాంట్రాక్టర్‌గా చేసినట్లు చర్చ జరుగుతోంది.
- విధుల పట్ల నిర్లక్ష్యం, అధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తాడనే ఆరోపణలు కోకొల్లలు.

నకిలీ మద్యం దందా..

కార్యదర్శిగా, కాంట్రాక్టర్‌గా చేస్తూ వచ్చిన ఆదాయం సరిపోవడం లేదని అక్రమ సంపాదన కోసం నకిలీ మద్యం దందాలో సదరు కార్యదర్శి పోలీసులకు దొరికిపోవడం గమనార్హం. ఈనెల 21న మహబూబాబాద్‌జిల్లాలో అక్రమ నకిలీ మద్యం తయా రు చేస్తూ అరెస్టయిన కేసులో సదరు కార్యదర్శి ఏ1గా ఉండడంవిశేషం. ఇదిలా ఉండగా నకిలీ మద్యంకేసులో కార్యదర్శి అరెస్టు, రిమాండ్ ఘ టన పై మండల అధికారులు జిల్లా అధికారులకులేఖద్వారా విషయం తెలియజేసినట్లు సమాచారం.

భార్యపై అనుమానంతో భర్త దాడి

మధిర: భార్యపై అనుమానంతో భర్త దాడి చేసిన ఘటన శనివారం రాత్రి మాటూరు గ్రామంలో చోటుచేసుకుంది. మాటూరు బీసీకాలనీలో నివసిస్తున్న సూర్యనారాయణ లారీడ్రైవర్‌గా పనిచేస్తుండగా భార్య సాయి నాగలక్ష్మి కూలి పనులకు వెళ్తోంది. ఇటీవల కాలంలో దంపతుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకుంటున్నాయి. శనివారం రాత్రి ఇంట్లో ఉన్న కత్తితో విచక్షణా రహితంగా నాగలక్ష్మిపై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వారికి ఇద్దరు కుమారులు కాగా ప్రస్తుతం నాగలక్ష్మి గర్భవతి అని తెలిసింది. గతంలో కూడా భార్యపై సూర్యనారాయణ దాడి చేసి గాయపరచగా మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ లక్ష్మీభార్గవి ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐసీడీఎస్ సంరక్షణలో బాలిక

- పాల్వంచ పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు
- నిందితులను పట్టుకోవాలని ఎస్పీ ఆదేశం



పాల్వంచ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కొత్తగూడెంటౌన్: ఏపీలోని చింతూరు మండలానికి చెందిన బాలిక(17).. రాత్రి 11 గంటల సమయంలో పాల్వంచ మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయం సమీపంలోని డివైడర్‌పై బిక్కుబిక్కుమంటూ కూర్చోగా.. సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన ఆలయ వాచ్‌మెన్ బాలికకు ఆశ్రయం కల్పించాడు. శనివారం ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించగా.. వారు బాలికను కొత్తగూడెంలోని శక్తి సదన్‌కు తరలించి సంరక్షించారు. ఈ మేరకు సీడీపీఓ లక్ష్మీప్రసన్న ఆదివారం పాల్వంచ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. అనంతరం బాలికను పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేశారు. చింతూరు మండలానికి చెందిన బాలిక ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్లేందుకు శుక్రవారం సాయంత్రం కుంటలో బస్సు లేకపోవడంతో ట్రాలీ ఆటో ఎక్కింది. అయితే ట్రాలీలో ఉన్న యువకులు మధ్యలో తనకు కూల్‌డ్రింక్‌లో మద్యం కలిపి తాగించారని, ఆ తర్వాత మెలకువ వచ్చేసరికి పెద్దమ్మగుడి వద్ద ఉన్నానని చెప్పినట్లు ఐసీడీఎస్ అధికారులు వెల్లడించారు. బాధితురాలి వివరాలు తెలుసుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించామని సీడీపీఓ లక్ష్మీప్రసన్న, బాలల సంక్షేమాధికారి హరికుమారి తెలిపారు. అయితే బాలికపై అత్యాచారం జరిగిందా లేదా అనేది వైద్యుల రిపోర్టు వస్తే కానీ వెల్లడి కాదని చెప్పారు. కాగా, బాధితురాలిపై అమానవీయంగా వ్యవహరించిన ఘటనను ఎస్పీ రోహిత్‌రాజు తీవ్రంగా పరిగణించారు. నిందితులను పట్టుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.